


ఉపాధ్యాయ వృత్తి ఆదర్శాన్ని గురించి చెపుతూ పెద్దలెల్లా వేదికలెక్కి మహోపన్యాసాలిస్తారు! కాని నేటివరకు బ్రతుకు సాగించుకోడమే బడి పంతుళ్ళకు దుర్భరమవుతూంది. బ్రతక లేక బడి పంతులన్న సామెతకు ఇంకా కాలదోషం పట్టింది!

హాలంతా కిటకిటలాడుతూంది జనంతో. భూమి వేస్తే రాలనట్లుంది. ప్రజల దృష్టి అంతా వేదిక వైపే ఉంది. ఆనాటి ప్రసంగాలను వినడానికి ఎంతో కుతూహలంతో ఎదురుచూస్తున్నారు.

పూలతోరణాలతో వేదిక చక్కగా అలంకరించ బడింది. మధ్య మధ్య చిన్న చిన్న రంగుబల్బులు ఆరుతూ వెలుగుతూ సభ్యుల దృష్టిని తమవైపు మళ్ళించు కుంటున్నాయి.

చక్కగా ముస్తాబైన పదేళ్ళ బాలిక పెద్ద పూల మాల చేత పట్టుకుని మెల్లిగా వేదికమీదికి వచ్చి రామంమాష్టారి మెడలో వేసి, పుష్పగుచ్ఛాన్ని ఆయన చేతి కిచ్చింది.

సభ్యులంతా చప్పట్లు కొట్టి తమ హర్షాతిరేకాన్ని తెలిపారు.

రామంమాష్టారు లేచి నుంచుని ప్రజానీకానికి వినయ వినమితోత్తమాంగుడై నమస్కరించి, చిరునవ్వుతో పుష్పగుచ్ఛాన్ని తీసి ఎదుట బల్లమీద ఉంచి కూర్చున్నారు.

అందరి దృష్టి ఆయనవైపే ఉంది.

ఆనాడు రామంమాష్టారి వీడ్కోలు సభ. ఇన్నాళ్ళుగా విద్యార్థులపాలిటి కల్పవృక్షమనదగిన రామంమాష్టారు రిటైరవడం అందరికీ ఎంతో ఆవేదనగా ఉంది.

పురపాలక సంఘాధ్యక్షులు ఆ సభకు అధ్యక్షులు. వేదికమీద రామంమాష్టారితోబాటు అధ్యక్షులు, హెడ్‌మాష్టరుగారు, మరి ఇద్దరు పుర ప్రముఖులు ఆసీనులై ఉన్నారు.

విద్యార్థినుల 'వందేమాతరం' గీతాలాపనతో సభా ప్రారంభం జరిగింది. అధ్యక్షులు లేచి "ఇప్పుడు కృష్ణమూర్తిగారు మాట్లాడతారు" అన్నారు.

కృష్ణమూర్తిగారు (స్కూల్స్ ఇన్‌స్పెక్టరు) మైకు సమీపించి ఈవిధంగా మాట్లాడారు:

"ఈనాడు రామంమాష్టారికి సగౌరవంగా వీడ్కోలిస్తున్న ఈ సభకి నన్ను వక్తగా పిలిచి ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలిగించిన హెడ్‌మాష్టరు గారికి ఎంతో కృతజ్ఞుణ్ణి. ఈనాడు నా జన్మ ధన్యమైనట్లు భావిస్తున్నాను.

పూజ్యులైన రామంమాష్టారివద్ద చదువుకున్న వారిలో నేను మొదటివాణ్ణి. వారి శక్తిసామర్థ్యాలు, మంచితనం తెలుసుకునే శక్తి నాకు లేదు. కాని,ఆయనను చూడగానే ఒక దైవాన్ని చూసినట్లు, ఏ మహనీయుణ్ణో చూసినట్లు అనుభూతి పొందేవాణ్ణి. ఆయన పాఠం చెబుతూ ఒకనాడు 'పాఠం అర్థం కావడం లేదా? అలాగ నన్ను చూస్తున్నావు?' అని అడిగారు.

సిగ్గేసి తల వంచుకున్నాను.

ఒంటిగంట కొట్టాక నన్ను పిలిచారు. క్లాసులో అడిగినట్లే, 'నీకు పాఠం అర్థంకావడంలేదా?' అని అడిగారు.

'మీరు చెబితే అర్థం కాకపోవడమేమిటండీ!' అన్నాను చటుక్కున.

'ఏం? నా ప్రత్యేకత ఏముంది? నేను దేవుణ్ణా?' అన్నారు.


'ఆఁ. దేవుడే' అనాలనిపించింది. కాని సిగ్గు, భయం ముంచెత్తి నన్ను మాట్లాడనీయలేదు.

క్రమంగా వారి అందరి విద్యార్థులలోను అదే విధమైన భక్తిగౌరవాలను సంపాదించారు మాష్టారు.

గంట కొట్టేసరికి క్లాసుకి హాజరయ్యేవారు. ఆలస్యంగా రావడం అన్నది ఆయన ఎరుగరు. వారి రాకను బట్టి గడియారాలు సరిచేసుకోవచ్చు.

స్కూలులో అడుగుపెట్టింది మొదలు పాఠాలు చెప్పడంలోను, విద్యార్థులచేత సమాధానాలు చెప్పించడంలోను నిమగ్నులయ్యేవారు. ప్రతి విద్యార్థిపట్ల, విద్యార్థినిపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకునేవారు. పాఠం చెబితే అన్నం కలిపి తినిపించినట్లే కదా!

పాఠాలే కాదు. మధ్యమధ్య మాకు పనికివచ్చే విషయాలెన్నో చెప్పేవారు. దేశ కాల పరిస్థితులు, మన కర్తవ్యం, అంటే ప్రజల కర్తవ్యం మొదలైన విషయాలు చెప్పేవారు. 'దేశం ఎటువంటి క్లిష్ట పరిస్థితుల నెదుర్కొంటున్నా ప్రజలు తమ పనులను మానుకుని పోరాదు. ఎవరి పనులు వారు చేసుకుపోతూ ఉండాలి. అదికూడా మన విధులను మనం నిర్వర్తించినట్లే కాగలదు. అలా చెయ్యకపోతే మన ప్రభుత్వానికే సమస్య అయిపోతాం' అంటూ బోధ



చేసేవారు. ఆనాడు ఆయన చేసిన బోధలు మా జీవితానికి మార్గదర్శకాలై, మా అభివృద్ధికి దోహదం చేశాయి.

రామం మాస్టారి ఋణం ఏనాటికీ తీర్చుకోలేం. భక్తితో ఇచ్చిన ఫలాన్నైనా ఎన్నడూ ఆయన తాకలేదు.

'గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః'

అన్న శ్లోకానికి ఆయన రూపకల్పన అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

పూజ్యులైన రామం మాస్టారు తమ విధ్యుక్తధర్మాన్ని పూర్తిగా నెరవేర్చి ఈనాడు ఆ బాధ్యతలనుండి విముక్తులై విశ్రాంతి పొందబోతున్నారు. నాకీ సందర్భంలో పాల్గొనే అవకాశం కలిగించిన పెద్దలకు మళ్ళీ కృతజ్ఞత తెలియచేస్తున్నాను. ఆనందంలో ఏమీ మాట్లాడలేకపోతున్నాను.

మా రామం మాస్టారు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వీరి విజ్ఞత దేశానికెంతో ఉపయోగపడ ...



## — వేదుల మీనాక్షిదేవి —

పడగలదని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను."

కృష్ణమూర్తిగారు సభ్యులకు నమస్కరించి, రామం మాస్టారి పాదాలకు వంగి నమస్కరించి వెళ్ళి కూర్చున్నారు.

సభలో హర్షధ్వానాలు చెలరేగాయి.

తరవాత మాట్లాడినవారు హెడ్‌మాస్టరుగారు. ఆయన వచ్చి ఒక్క సంవత్సరంమాత్రమే అయింది.

"అధ్యక్షులకు, సభ్యులకు నమోవాకములు. ఇటువంటి ప్రశంసనీయమైన సభ ఒక స్కూలు మాస్టారికి జరుగుతూందంటే చాలా విచిత్రమైన సంగతిగా చెప్పాలి. ఎందుకంటే 'బ్రతుకలేకపోతే బడి పంతులు' అన్న సామెత అందరికీ తెలుసు. బడి పంతులంటే ఎవరికి లెక్కలేదు." ("మంత్రులంటేనే లెక్కలేదు" అని సభలోనుండి ఒక కేక.)

హెడ్‌మాస్టరుగారు నవ్వి, తల ఊపి అన్నారు: "కానీయండి." ఎవ్వరిని లెక్కచెయ్యని రోజులు వచ్చాయి. అటువంటప్పుడు 'నాయనా, అలా చేయకు. ఇలా చెయ్యి' అని చెప్పే బడిపంతుళ్ళని ఎవ్వరు లెక్క చేస్తారు ?

నేను ఊరు వచ్చి ఏడాది అయింది. నేను స్వంతం వాళ్ళ కాను. అనుభవజ్ఞులు, గుణసంపన్నులు అయిన రామంమాస్టారి సహాయ సహకారాలెంతో పొందాను.

వీరి దక్షత నేను చాలాకాలంనుండి వింటున్నాను. వీరివద్ద చదువుకుని పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారు ఎందరో ఉన్నారు. వీరితో పనిచేసి బదిలీ అయిన తోటి ఉపాధ్యాయులు ఉన్నారు. వారందరివల్ల వీరి సంగతులు బాగా తెలిశాయి. ఈ సంవత్సరంనుండి ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. తాము పనిచేసే సంస్థపట్ల అత్యంత భక్తిగౌరవాలున్న వ్యక్తి. తమ విధ్యుక్తధర్మం తు.చ. తప్పక నెరవేర్చే ఘనుడు.

ఆయన ముప్ఫైఏళ్ల సర్వీసులో ఒక్క రిమార్కు లేదు. ఎవ్వరిచేత వేలుపెట్టి చూపించుకోలేదు. పైగా, ఉత్తముడైన ఉపాధ్యాయులుగా పేర్కొనబడ్డారు.

ఇది ఈయనకు కాదు; మాకు, మా విద్యాసంస్థకు గర్వకారణం. విద్యార్థికులు, లాయర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఒకరనేమిటి సినీమాస్టార్లమొదలు చక్రవర్తులవరకు ఉపాధ్యాయుడే గురువు అన్న సంగతి విస్మరించరానిది.

రామంగారివంటి ఆదర్శోపాధ్యాయులెందరున్నారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేం. ఇంత పూజ్యత సంపాదించిన వీరు మనకు పూజ్యతములు. వీరి సేవతో

మా విద్యాసంస్థ పునీతమైంది. భగవంతుడు వీరికి ఆయురారోగ్యాలను ప్రసాదించుగాక!"

హెడ్మాస్టరుగారి ప్రసంగానంతరం మోహనరావు గారు ప్రసంగించారు.

"నేను, మా రామంమాస్టారు సహోద్యోగులం. మా రామం ఈనాడు తన డ్యూటీనుండి విరమిస్తున్నాడంటే నేనెంతో సంతోషిస్తున్నాను. ఎందుకంటే ఇటు స్కూలులోను, అటు బయటకూడా క్షణం తీరికలేదు. ఇకముందు కాస్త సుఖంగా ఊపిరి పీల్చుకుని బ్రతుకుతాడని.

తోటి ఉపాధ్యాయులు వారి ఉద్యోగాలకు సంబంధించిన ఏ సందర్భంలోనైనా సలహా కావలిస్తే రామం మాస్టారే చెప్పాలి. స్కూళ్లలో తమ పిల్లల్ని చేర్పించడానికి, ఏ స్కాలర్‌షిప్‌కైనా దరఖాస్తు పెట్టడానికి తలిదండ్రులు ఆయన సలహా పొందేవారు. బయటకూడా మంచి పేరుంది. గుమ్మం దిగిందిమొదలు మళ్లీ గుమ్మం ఎక్కేవరకు 'నమస్కారం మాస్టారూ' అంటూ అడుగడుగునా ఎవరో ఒకరు పలకరిస్తూ నిలవేస్తూనే ఉంటారు. అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలు కనుక్కుంటారు.

స్కూల్లో తమ ధర్మనిర్వహణలో కృతకృత్యులయ్యారు. విద్యార్థులకు సులభ్యంగా ఉండేందుకు పుస్తకాలు వ్రాశారు. వీరి పుస్తకాలని చాలా స్కూళ్లలో వాడుతున్నారు.

ఈయన ఎన్నడూ ప్రైవేట్లు చెప్పలేదు. అది తమ ధర్మానికి విరుద్ధమట. అయితే, తెలియలేదని వచ్చిన వారిని కూర్చోబెట్టి అర్థమయ్యేలాగ ఎంతసేపైనా సరే చెప్పేవారు ఉచితంగా.

నా స్నేహితు డింతవాడని చెప్పుకుంటూంటాను. ఈనాటీయనకు ఇంత ఘనంగా వీడ్కోలిస్తూ, ఈయన సేవను గుర్తించిన హెడ్‌మాస్టరుగారెంతో అభినందనీయులు.

మా రామం దొడ్డ మాస్టారు" అంటూ తమ ప్రసంగాన్ని ముగించారు మోహనరావుగారు.

అధ్యక్షుడు లేచి వక్తల ప్రసంగాలను సాకల్యంగా తెలియజేస్తూ రామంమాస్టారు పేరు స్వర్ణాక్షరాలతో లిఖించదగిన వ్యక్తి అన్నారు. "ఇరుగు పొరుగు వ్యక్తిగా, విద్యార్థుల తండ్రిగా వీరితో నాకు గల పరిచయమే ఈనాడీ స్థానంలో నిలబడడానికి ప్రోత్సహించింది. ఈయన కేవలం ఉపాధ్యాయుడే కాదు; సంఘంలో అందరి మంచిచెడ్డలు తమవిగా భావించే సహృదయుడు. 'బాగున్నారా?' అని ఎవరినైనా వీరు పలకరిస్తే అనారోగ్యంగా ఉన్నవారుకూడా ఆరోగ్యంగా ఉన్నట్లు అనుభూతి పొందేవారు.

బొట్టగోచి పోసిన పంచకట్టుతో, లాల్చీతో, నవ్వుగా, పొడుగ్గా, తెల్లగా, మూర్తీభవించిన శాంతమూర్తిలాంటి రామంమాస్టారిని చూడనివాళ్లు, ఎరుగనివాళ్లు లేరు.

ఈయన ముప్పైఏళ్ల సర్వీసులోను ఒక్క రోజు కూడా సెలవన్నది పెట్టి ఎరుగడు. ఎంత స్నేహితులైనాసరే, అధికారులైనాసరే వచ్చి మాట్లాడుతుంటే వారి నొకమారు పలకరించి, 'క్షమించండి. వెళ్లివస్తా' అని వెళ్లిపోయే ఆయన్ను చూసి 'ఎంత విధినిర్వహణ!' అని విస్తుబోయి చూసేవారు..."

ఈవిధంగా ఆయన మాట్లాడుతూంటే సభ్యులు చెవులు దొరపెట్టుకొని వింటున్నారు.

కాని, రామం మాస్టారుకు ఇవేవీ వినబడ్డంలేదు. ఆయన హృదయసాగరంలో ఆలోచనాతరంగాలు ఉవ్వెత్తున లేచి, విరిగిపడి అల్లకల్లోలం చేస్తున్నాయి.

'తన జీవితానికి విశ్రాంతి లభించిందంటూంది లోకం. తనకో? . . . . ఇది తీరని ఆవేదన. ఎప్పటి కప్పుడు చాలీ చాలని జీతంతో సంసారాన్ని నెట్టుకు వస్తున్నాడు. వెనకవచ్చే బడాయిమేమీ లేదు. తనలాగ మేష్టరీ చేయించడం ఇష్టంలేక తన పెద్దకొడుకుని ఎమ్. ఎ. చదివించాడు. భగవత్కృపవల్ల ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడా అబ్బాయి. అతనికి ఉద్యోగం రావాలి. వచ్చినా వాళ్లది వాళ్లకే చాలదు. అందరి పోషణకి ఎక్కడ? . . . ఆడపిల్ల పెళ్లీడుకు వచ్చింది. ఎంతలేదన్నా బహిరంగంగా కాకపోయినా చాటుగానైనా కట్నం ఇవ్వాలి . . . . లాంఛనాలు లోపాయికారీగానే ముట్టచెప్పాలి. ఇవన్నీకాక పెళ్లిఖర్చు ఉండనే ఉంది. ఆపైన పండుగలు, పబ్బాలు. అప్పట్లు, ముప్పట్లు ... ఈ బాధ పడలేక ఆ విషయం. కొంతకాలం వాయిదావేసేశాడు తను. ఎప్పటికైనా ఒక అయ్య చేతులో పెట్టవలసిన విధి తనపైన ఉండనే ఉంది.

## శిల్పసుందరి

ఫోటో—దిలీప్‌కుమార్ పెంటు (హైదరాబాదు)



'మరో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ఒకడికి మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చింది. పాలిటెక్నిక్‌లో చేరి రెండేళ్లయింది. ఇంకా ఒక సంవత్సరం చదువుంది. ఆఖరి పిల్లవాడు పిదపఫారం చదువుతున్నాడు. పిల్ల అయిదవ తరగతి చదువుతూంది.

'సరిగ్గా ఒక్కడూ చేతికంది రాలేదు. రిటైర్ అయితే పింఛను వస్తుంది...జీతం అంత కాకపోయినా సెలాఖరు కాగానే ఎంతో కొంత వస్తుందన్న ధీమా అయినా ఉంటుంది. దానితో గడపనూ గడపదు. . . . పోనీ అదైనా వెంటనే వస్తుందా? . . . ఎప్పటికోగాని లెక్కలు అవి తేలవు. రెండు సంవత్సరాలైనా పింఛను రానివాళ్ల నెందరినో తను చూస్తున్నాడు.

'సర్వీసునుండి రిటైరింగ్ అవ్వడుతోపాటే వారి పెన్షన్ సెటిల్ ఇస్తే బాగుంటుందనీ, ప్రభుత్వం ఆ ఏర్పాటు చేయించాలనీ అప్పుడప్పుడు పేపర్లో చర్చలు పడడం చూస్తున్నాడు . . . ఏ పాటో ప్రావిడెంట్‌ఫండ్ ఎప్పుడో వస్తుంది.

'ఇప్పుడు గట్టిగానిలేస్తే పదిరూపాయలు లేవు తన చేతిలో. రేపు అన్నరోజు ఎలా గడుస్తుందన్న పరిస్థితిలో పడ్డాడు తను. భావి జీవితం తన ఎదట పెద్ద ప్రశ్నార్థకమలు కూర్చుంది..."

వక్తల, అధ్యక్షుని ఉపన్యాసా లయిపోయాయి.

"ఇప్పుడు రామం మేస్టారు సమాధానం చెబుతారు" అన్న మాటలు వినబడడంతో ఊహాలోకాలనుండి ప్రకృతావస్థకు వచ్చారు మేస్టారు. నిద్రనుండి మేల్కొన్నట్లు నాలుగు వైపులా కలయజూశారు. ఎదట ఆతురతతో వేచిఉన్న సభ్యులను, వేదికమీది వ్యక్తులను చూశారు. విషయం గ్రహించారు. లేచి చిరునవ్వు తెచ్చుకుని నమస్కరించారు. తనకింత గౌరవం చూపిన అందరికీ కృతజ్ఞత తెలియజేశారు క్లుప్తంగా.

రామం మేస్టారిమీద పద్యాలు వ్రాయించుకుని వచ్చి కొందరు విద్యార్థులు చదివారు.

సభ పూర్తయింది.

అందరితోనూ కలిసి స్కూలు గేటుదగ్గరికి రాగానే ఒక్కమారు వెనక్కి తిరిగి స్కూలును తమ కళ్లకు ఆనినంతమేర చూశారు. ఆయన కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. భక్తితో రెండుచేతులు జోడించి ముందుకు సాగారు.

ముప్పై సంవత్సరాలుగా తనకు అవినాభావ సంబంధంగా ఉన్న ఆ సంస్థతో తనకు ఈనాడు ఋణం తీరింది. తనకక్కడ ఇక స్థానం లేదు. సైనాలెంతో ఇకమీద తనూ అంతే.

ఆ భావం ఆయన్ని శోకాతురుణ్ణి చేసింది. కళ్లు తుడుచుకున్నారు.

స్కూలు బృందంవారు ఆయన్ని సగౌరవంగా ఇంటివద్ద దిగవిడిచి తమ భక్తి ప్రదర్శించుకున్నారు.

ఆరాత్రి . . . .అనేకములైన ఆలోచనలతో తెల్లవారింది రామం మేస్టారికి.

హెడ్‌మాస్టరు తనకు అంతవరకు రావలసిన జీతం ఇప్పించేశారు. ఆ సొమ్ముతో పాలకు, చాకలికి, వెచ్చాలు మొదలైన బాకీలు చెల్లించాడు తను. పిల్లల జీతాలు కట్టేశాడు.

ఆనెల బాకీలు తీర్చివేస్తే, ఇక భవిష్యత్తులో ఏమిటి?

రామం మేష్టారి ఆలోచనలకు 'అంతరాయం కలిగిస్తూ ''చూడండి. పాలవీరమ్మ రేపటినుండి పాలు పొయ్యలేదట. గేదె వట్టిపోయిందిట. మేపలేక తోలి పెట్టేస్తున్నాదట'' అంది ఆయన భార్య.

''వీరమ్మా, ఇంకా గేదెలూ, ఆవులూ ఉన్నాయి కదూ మీకు? వాటివి పొయ్యి. ఇన్నాళ్లనుండి వాడుకగా పోస్తూ, వటుక్కున మానేస్తే ఎలాగ?' అన్నారు మేష్టారు.

''ఆ పాలకే పాడికలున్నాయండి, బాబూ'' అని చేతులు నలుపుకుంటూ వీరమ్మ వెళ్లిపోయింది. మర్నాడు పాలు తేలేదు. ఆనాడు కాఫీ ఎవరూ తాగలేదు.

'తెల్లవారితే గుమ్మంలోకి వచ్చే పాలు, పెరుగు నూనె, నెయ్యి వాడుకలవాళ్లు క్రమంగా రావడం లేదు. మూసి, పిలిస్తే వచ్చి సగం సగం పోస్తున్నారు. వెచ్చం షావుకారు ''రొక్కం ఇచ్చి పట్టుకువెళ్లండి సరుకు'' అని నిర్మొహమాటంగా చెప్పనే చెప్పేశాడు. వాడుకలవాళ్లు పద్దులకు ఒప్పుకోడంలేదు.

'తను ఉద్యోగవిరమణ చేసినట్లు అందరికీ తెలిసింది. నెలాఖరుకి ఠల్లున చేతిలో జీతం పడేది కనక అంతా ఇన్నాళ్లూ ఇచ్చారు. ఈనాడు తనమీద నమ్మకం పోయిందన్నమాట! నిజమే. పెన్షను వచ్చేదాకానే కాదు. వచ్చినా తను తీర్చలేడని వాళ్లకు తెలుసు. తను నిప్పు వంటివాడని తెలుసు. బాకీ తీర్చేదాకా నిద్రపోడనీ తెలుసు. అయితే వాళ్లననవలసిన పనేముంది? తన మీద నమ్మకం పోయిందని ఎందుకనుకోవాలి? తనయందు వాళ్లకి గౌరవం పోలేదు. అయితే తనకు చూపిన ధర్మం ఉంటుందా? తన పింఛను ఎప్పుడు వస్తుందో తనకే తెలియనప్పుడు తనైనా ఎన్నాళ్లు డబ్బివ్వకుండా వాళ్లని తిప్పడం? వాళ్లకి మాత్రం సొమ్ము అవసరం కాదా? చేతిలో సొమ్ము ఆడుతూంటేనే వ్యాపారాలు సాగడం .... వాళ్ల తప్పేం లేదు. ... రొక్కాలే ఆధారమైన తనే ఇవన్నీ ఆలోచించుకుని ఉండవలసింది' అనుకున్నాడు రామం మేష్టారు.

ఓనాటి మధ్యాహ్నం పెద్దకొడుక్కి హైదరాబాదు నుండి ఇంటర్వ్యూ వచ్చింది. ఉద్యోగం వస్తుందేమోనని ఆశున్నా 'ఎలాగ పంపడం? రానూపోనూ ఖర్చులకు సొమ్ము కావాలి. ఎక్కడనుండి తేవడం?' అన్న సమస్యే బాధిస్తూంది. ఏమీ తోచలేదు.


చివరకు భార్య చేతులనున్న ఒక్క గాజులజత మార్వాడీవద్ద తాకట్టు పెట్టి ఆ సొమ్ముతో కొడుకును పంపాడు.

నాలుగవనాడు అబ్బాయి తిరిగి వచ్చాడు. రెండువేల అప్లికేషన్లు వచ్చాయట. ఉన్న ఖాళీలు నలభై. ఇంటర్వ్యూకి ఎనభైమందిని పిలిచారట. ఫలితం చెప్పలేనన్నాడు.

'కానియ్. పాదు పోసినవాడు నీరు పోయక పోతాడా?' అనుకున్నారు రామం మేష్టారు గుండె రాయిచేసుకుని.

'పోనీ తనూ, కొడుకూ ట్యుటోరియల్ స్కూలు అంటూ పెట్టి నడిపితే? ... ఫెయిలయినవాళ్లను తయారు చెయ్యడమేకాక, స్కూళ్లలో చదువుకునే పిల్లలు కూడా ప్రైవేట్లు చెప్పించుకుంటూంటారు. ఇప్పుడు తను ప్రైవేటు చెప్పినా తప్పులేదు. ..'

ఈ సంగతి ఊళ్లో తన పరిచయస్థులతో చెప్పాడు.



గంగిగోవుపాలు

చిత్రం—బి. ఎస్. స్వామి (మురపాక)

వాళ్లు ఎగిరి గంతువేసి చెప్పిస్తారని ఆశించాడు కొండంతగా.

''మీరెప్పుడూ ప్రైవేట్లు చెప్పలేదు. ప్రైవేటు చెప్పే పద్ధతి మీకు తెలియదు. పైగా ఉద్యోగంలో ఉన్నవాళ్లు ప్రైవేటు చెబితే అవసరం వస్తే ఏ మేష్టరుతోనైనా చెప్పి నాలుగు మార్కులు వేయిస్తారు. అందుకని మా పిల్లల క్లాసు మాష్టర్లనే ప్రైవేటుకి ఏర్పాటు చేశాం. ఇలాగ అన్నామని మీరేమీ అనుకోకండి మేష్టారు. ఇప్పుడు మీకా సబ్జక్టుతో టచ్‌కూడా లేదు'' అన్నారు అంతా.

ఎదురు చూడని ఆ సమాధానాలకు నిరుత్తరుడయ్యారు రామం మేష్టారు.

ఇన్నాళ్ల తన అనుభవము, జ్ఞానము వృథా ఏనా? తనకు తెలియకుండా తనలోని శక్తులు అదృశ్యమౌతున్నాయా? ... విస్తుపోయారు మేష్టారు. కంపరం ఎత్తిపోతూందాయనకు.

ఎటు చూసినా అడవి ముళ్లాగా ఉంది. తెల్లవారుతుందంటే భయంగా ఉంది.

ఆయన రిటైరయి నెల అయింది. ఇల్లుగల ఆసామి అద్దెకై తిరిగిపోతున్నాడు.

ఏమీ పాలుపోవడం లేదు రామం మేష్టారికి. తనొక్కడికైనా సరిపోతే! అయ్యో, భార్యాబిడ్డల బ్రతుకుమాట అలా ఉంచి లోకం తన్ని దుమ్మెత్తి పోస్తుంది. ''ఇన్నాళ్లు ఏం నిర్వాకం చేశాడు? వాళ్ల ఖర్మానికి వాళ్లని వదిలి పోయా'' డని నిందిస్తుంది. అదీగాక ఇన్నాళ్ళు ధర్మంగా బ్రతికి, అంతా అలాగ బ్రతకాలని బోధించిన తనే అధర్మంగా ప్రవర్తించడమా? భార్యాబిడ్డలను పోషించడం తన విధి. ఆ విధిని తప్పించుకో చూడడం తప్పు. ఇప్పుడు తనేం చెయ్యాలి? ఎంతసేపు ఆలోచించినా ఏ నిర్ధారణకు రాలేకపోతున్నాడు.

చిక్కి సగమయారు బెంగతో.

ఓనాడు తన ప్రాణస్నేహితుడైన రమణయ్య పంతులు దగ్గరికి వెళ్లి వాపోయాడు.

ఆయనా చాలా విచారించారు.

''నువ్వేకాదు, నాయనా. ఏ విధమైన ఆస్తిపాస్తులు లేనివాళ్లు చాలామంది ఉన్నారు. జీతాలు తాబేలు నడక, ధరలు కుందేలు పరుగుగా ఉన్న ఈ రోజులలో ఎంత తెచ్చినా చాలకుండా ఉంది. నువ్వేమీ దుర్వినియోగం చెయ్యలేదు. నువ్వెలాగ గడుపుతున్నావా అని నేనూ అనుకుంటూనే ఉన్నాను. మొన్న పేపర్లో మనపక్క ఊళ్లో కొత్తగా స్కూలు పెడుతున్నారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కావాలని ప్రకటించారు. నీతో ఇవ్వాళే వచ్చి చెబుదామనుకుంటున్నాను. వెంటనే దరఖాస్తు పడెయ్యి. 'శుభస్య శీఘ్రమ్' అన్నారు. ఇవాళ తిథికూడా మంచిది'' అన్నారు రమణయ్య పంతులు.

రామం మేష్టారి కళ్లు నీళ్లతో నిండాయి.

'తనకు మళ్లీ ఉద్యోగమా? తను చెయ్యగలడా? చెయ్యకపోతే ఇంటిదగ్గర వాళ్ల బ్రతుకు? ... పోనీ తన కొడుకు చేస్తాడంటే కొత్తవాళ్లకి ఇవ్వరు. .. ఈ పరిస్థితిలో ఓపిక ఉండో లేకో తనే చెయ్యాలి ఉద్యోగం. తన ముక్కున ఊపిరి ఆడినంతకాలం శ్రమ పడక తప్పదు. ఇంతవరకు ఎన్నో ఉత్తరాలు తన పెన్షను గురించి పైకి వ్రాసుకున్నాడు. ఏం సమాధానం లేదు. ..''

రమణయ్య పంతులు స్నేహితుడిలాగ కాక తన చిక్కులను తీర్చడానికి వచ్చిన దైవస్వరూపుడిలాగ కనిపించారు ఆయనకు. లేచి రమణయ్య పంతులును గట్టిగా కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడ్చారు. దానితో ఆయన హృదయభారం కొంత తగ్గినట్లనిపించింది.

''పూరోత్పీడే తటాకస్య పరీవాహః ప్రతిక్రియా'' అన్న భవభూతి ఎంత అనుభవంమీద చెప్పాడో కదా!

వారంరోజులలో రామం మేష్టారిని కొత్త స్కూల్లో వేసుకున్నట్లు ఆర్డరు వచ్చింది!

''ఒళ్లు దాచుకోకుండా, దైవముఖం చూసి ముప్పై ఏళ్లు చేసిన సేవకు చివరకు మిగిలింది ఇదా!'' ఆర్డరు చేత్తో పట్టుకుని తనలో తను గొణుగుకుంటున్నట్లుగా అనుకున్నారు రామం మేష్టారు! ★